



బడ్జెట్ ప్రజలఆకాంక్షలు అందుకునేనా ?


# జర్నలిస్ట్ వార్త

TELTEL/2023/87607

తెలుగు దిన పత్రిక

అనుక్షణం ప్రజల పక్షం...



WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103



సంపుటి - 1 సంచిక - 344 శుక్రవారం 24 జనవరి 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


# దావోస్ సూపర్ హిట్

## రూ. 1,78,950 లక్షల కోట్లు

- అమెజాన్ రూ. 60 వేల కోట్లు
- ఉర్సా క్లస్టర్ రూ.9500 కోట్లు
- బ్లాక్‌స్టోన్ రూ. 4,500 కోట్లు
- మైత్రా ఎనర్జీ రూ. 7000 కోట్లు
- టిల్మాన్ రూ.15 000 కోట్లు
- ఇన్ఫోసిస్ రూ. 750 కోట్లు
- విప్రో కొత్త ఐటి సెంటర్
- సంగారెడ్డిలో సుహానా మసాలా ఎక్సలెన్స్ సెంటర్



- ప్రపంచ ఆర్థిక సదస్సులో భారీ పెట్టుబడులపై ఒప్పందాలు
- గత సంవత్సరం కన్నా 4 రెట్లు అధికంగా పెట్టుబడులు
- కొత్తఒప్పందాలతో 49,500 మందికి ఉద్యోగావకాశాలు
- మొదటి స్థానంలో మహారాష్ట్ర, రెండో స్థానంలో తెలంగాణ
- ముగిసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన..




జనవరి 23(జర్నలిస్ట్ వార్త):

దావోస్ వేదికగా నిర్వహించిన ప్రపంచ ఆర్థిక సదస్సులో తెలంగాణ ప్రభుత్వం తన సత్తా చాటింది. పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో, తన ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇదే వేదికపై సాధించిన పెట్టుబడుల రికార్డులను తిరగరాస్తూ సిఎం రేవంత్‌రెడ్డి, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్ బృందం భేష్ అనిపించుకుంది. ప్రపంచ ఆర్థిక సదస్సులో ఈసారి తెలంగాణ ప్రభుత్వం రూ.1,78,950 కోట్ల పెట్టుబడులను, ప్రత్యేక్షంగా 49,500 ఉద్యోగ అవకాశాలను సాధిం చింది. 20 బడా కంపెనీలతో ఒప్పందాలను కుదర్చుకుంది. రాష్ట్ర రాజధాని ఒక్క హైదరాబాద్‌లో కాకుండా పెట్టుబడులకు రాష్ట్రంలో ఇతర ప్రాంతాలలో కూడా సానుకూల పరిస్థితులు ఉన్నాయని ఈసారి పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చిన కంపెనీలు కుదుర్చుకున్న ఒప్పందాలే నిదర్శనం. సదస్సుకు మూడు రాష్ట్రాల సిఎంలు, ఆరు రాష్ట్రాల మంత్రులు హాజరయ్యారు. తెలంగాణ చిన్న రాష్ట్రం అయినప్పటికీ పెద్ద రాష్ట్రాలను సైతం అధిగమిస్తూ రెండవ స్థానంలో నిలువగా దేశ ఆర్థిక రాజధానిగా పేరుగాంచిన మహారాష్ట్ర రూ. 6.3 లక్షల కోట్ల పెట్టుబడులతో మొదటిస్థానంలో నిలిచింది.

# సుప్రీంకు జలజగడం

## కృష్ణా జలాల కేటాయింపు వ్యవహారం

ఎపి పిటిషన్‌పై ఫిబ్రవరిలో విచారిస్తాం
సుప్రీం ధర్మాసనం స్పష్టీకరణ




హైదరాబాద్ :జనవరి 23(జర్నలిస్ట్ వార్త):

తెలుగు రా ష్ట్రాల మధ్య కృష్ణా నదీ జలాల వివాదం తా రాస్థాయికి చేరుకుంటోంది. సామరస్యంగా పరిష్కరించుకునేందుకు కేంద్ర ఏర్పాటుచేసిన కృష్ణా నదీ ట్రిబ్యూనల్‌పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఏపీ పిటీషన్‌ను విచారణకు స్వీకరించిన సు ప్రీం ఫిబ్రవరి 13వ తేదీకి వాయిదావేసింది. **మిగతాది 2లో...**

# ప్రపంచానికి మార్గదర్శిగా భారత్

- పలు కంపెనీలతో సిఎం చంద్రబాబు వరుస భేటీలు
- వేలకోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు




# రాహుల్ గాంధీకి అస్వస్థత

ఎన్నికల ప్రచారాన్ని రద్దు చేసుకున్న రాహుల్
వైద్యుల సూచన మేరకు ప్రచారాన్ని రద్దు చేసుకున్నారన్న ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్
రేపు ఎన్నికల ర్యాలీలో పాల్గొంటారని వెల్లడి




# హైదరాబాద్ ఆధారిత కంపెనీలతో దావోస్‌లో ఒప్పందాలా.?

## ఇదేనా రేవంత్ ఇన్నోవేటివ్ ఆలోచన
## ట్విటర్ వేదికగా సీఎంపై కేటీఆర్ సెటైర్లు

హైదరాబాద్,జనవరి 23(జర్నలిస్ట్ వార్త):రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం దావోస్‌లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. దావోస్ వేదికగా జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరంలో పలు కంపెనీలతో చర్చలు, ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఇప్పటికే మేఘా, స్కైరూట్ ఏరోస్పేస్, కంట్రోల్‌ఎస్ వంటి పలు కంపెనీలతో వేల కోట్ల ఒప్పందాలు జరిగాయి. అయితే ఈ పెట్టుబడుల ఒప్పందాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. రేవంత్ సర్కార్‌పై సెటైర్లు వేశారు. హైదరాబాద్ ఆధారిత కంపెనీలను దావోస్ తీసుకెళ్లి ఒప్పందాలు చేసుకోవటమేంటని అన్నారు. రేవంత్ సర్కార్ ఇన్నోవేటివ్



ఆలోచన, పాలన అంటే ఇదేనా? అని ప్రశ్నించారు. 'వినూత్న ఆలోచన అంటే ఏమిటి ? హైదరాబాద్ ఆధారిత కంపెనీలను స్విట్జర్లాండ్‌లోని దావోస్‌కి వేల మైళ్ల దూరం ప్రయాణించి పెట్టుబడులు ప్రకటించేలా చేయడం! నిజంగా సర్కస్‌లా ఉంది. హైదరాబాద్‌లో చాయ్ తాగుతూ పూర్తి చేయాల్సిన ఒప్పందాలను.. స్విట్జర్లాండ్‌లో హాట్ చాక్లెట్‌తో పూర్తి చేయాల్సి వచ్చింది.' అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

# మేయర్, డిప్యూటీ మేయర్‌లపై అవిశ్వాస తీర్మానం

పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం
నగరంలో పనులు ఆగిపోయాయన్న తలసాని
కమిషన్ ఇలంబర్తిని కలసి వినతి పత్రం సమర్పణ




హైదరాబాద్,జనవరి 23(జర్నలిస్ట్ వార్త): మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాస తీర్మానంపై శనివారం పార్టీ మీటింగ్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని కలిశారు. కమిషనర్‌ను కలిసి హైదరాబాద్‌లోని ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులపై నేతలు వినతిపత్రం సమర్పించారు. జీహెచ్ఎంసీ కమిషనర్‌తో గ్రేటర్ హైదరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు భేటీ అయ్యారు. కేవలం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను మాత్రమే ఛాంబర్ లోపలకు కమిషనర్ అనుమతించారు. ఛాంబర్ బయటనే బీఆర్ఎస్ కార్పొరేటర్లు వెయిట్ చేశారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ... నగరంలో ప్రజలు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రజా సమస్యలపై కమిషనర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చామన్నారు. స్ట్రీట్ లైట్స్ ఎక్కడ వెలగట్లేదు, రోడ్లు సరిగ్గా లేవు అని చెప్పారుఓవర్లపై నిర్మాణాలు ఆగిపోయాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది ఏ పనులు చేయకపోయినా తాము సైలెంట్‌గా ఉన్నాం.

# మావోయిస్టుల పేల్చివేత కుట్ర భగ్నం

## 50 కిలోల మందుపాతరను నిర్వీర్యం చేసిన బలగాలు

బీజాపూర్,జనవరి 23(జర్నలిస్ట్ వార్త): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా బాసగూడలో మావోయిస్టుల కుట్రను భద్రతా దళాలు భగ్నం చేశాయి. బాసగూడ-ఆవపల్లి మార్గంలో పోలీసుల వాహనాలను పేల్చేందుకు మావోయిస్టులు అమర్చిన 50 కిలోల మందుపాతరను సీఆర్‌పీఎఫ్ దళాలు నిర్వీర్యం చేశాయి. హైవేపై సొరంగం తవ్వి కల్వర్టు కింద మావోయిస్టులు మందుపాతర అమర్చినట్టు అధికారులు తెలిపారు. ముందుగానే గుర్తించి నిర్వీర్యం చేయడంతో ప్రమాదం తప్పిందని చెప్పారు. ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దులో ఇటీవల భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. గరియాబంద్, నౌపాడ జిల్లాల్లో భద్రతాబలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో 20 మందికిపైగా మావోయిస్టులు మరణించారు. ఈ క్రమంలో మావోయిస్టుల కోసం పోలీసుల వేట కొనసాగుతోంది.



జర్నలిస్ట్ వార్త
TELTEL/2023/87607



# దావోస్ సూపర్ హిట్




జనవరి 23(జర్నలిస్ట్ వార్త):

:దావోస్‌లో పెట్టుబడుల సమీకరణలో తెలంగాణ సరికొత్త రికార్డులు నెలకొల్పింది. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర చరిత్రలో భారీ పెట్టుబడుల రికార్డును నమోదు చేసింది. దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో ఇప్పటివరకు రూ.1,78,950 లక్షల కోట్ల పెట్టుబడులను తెలంగాణ సాధించింది. గతేడాది దావోస్ పర్యటనలో రాష్ట్రానికి రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అప్పటితో పో లిస్తే ఈసారి నాలుగు రెట్లకు మించి పెట్టుబడులు రావటం విశేషం. దావోస్ వేదికపై ఈసారి రాష్ట్రం అందరి దృష్టిని ఆకర్షించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సారథ్యంలో తెలంగాణ రైజింగ్ బృందం దావోస్‌లో వివిధ పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన సమావేశాలన్నీ విజయవంతమయ్యాయి. హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీ అ భివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమివ్వటం ప్రపంచ దిగ్గజ పారిశ్రామికవేత్తలను అమితంగా ఆకట్టుకుంది. దీంతోపాటు యంగ్ ఇండియా స్కిల్ యూ నివర్సిటీ, రీజనల్ రింగ్‌రోడ్డు నిర్మాణం,
మెట్రో విస్తరణకు ప్రభుత్వం ఎం చుకున్న భవిష్యత్ ప్రణాళికలు పెట్టుబడుల వెల్లువకు దోహదపడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎంచుకున్న తెలంగాణ రైజింగ్ 2050 విజన్ గేమ్ ఛేంజర్‌గా నిలిచింది. అన్ని రంగాలకు అనుకూలమైన వాతావరణమున్న గ్రేటర్ సిటీ పెట్టుబడుల గమ్యస్థానంగా మరోసారి ప్రపంచానికి చాటిచెప్పినట్లయ్యింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సరళతర పారిశ్రామిక విధానంతో పాటు ఇటీవల ప్రకటించిన క్లీన్ అండ్ గ్రీన్ పాలసీ ప్రపంచ పారిశ్రామికవేత్తలను దృష్టిని ఆకర్షించింది. దేశ, విదేశాలకు చెందిన పేరొందిన 20 ప్రముఖ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. ఐటీ, ఏఐ, ఇంధన రంగాల్లో అంచనాలకు మించినట్లుగా భారీ పెట్టుబడులను సాధించింది. దావోస్‌లో వరుసగా మూడు రోజుల పాటు ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాల ప్రకారం రూ.1,78,950 లక్షల కోట్ల పెట్టుబడులతో పాటు రాష్ట్రంలో 49,550 మంది యువతకు ఉద్యోగాలు లభించనున్నాయి.

20 ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు..

20 ప్రముఖ సంస్థల వివరాలు ఇలా ఉన్నాయి. 1. సన్ పెట్రో కెమికల్స్‌తో భారీ పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్‌ను, సోలార్ విద్యుత్తు ప్రాజెక్టులను ఏర్పాటు చేయనుంది. నాగర్ కర్నూలు, మంచిర్యాల, ములుగు జిల్లాల్లో ఈ సంస్థ ప్లాంట్‌లను నెలకొల్పనుంది. 3,400 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ హైడ్రో విద్యుత్, 5,440 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకానుంది. రూ. 45,500 కోట్ల పెట్టుబడులు పెట్టనుండగా 7,000 ఉద్యోగాలు లభించనున్నాయి. 2.అమెజాన్ వెబ్ సర్వీసెస్: ఏఐ, క్లౌడ్ సర్వీసెస్ డేటా సెంటర్లలో అమెజాన్ భారీ పెట్టుబడులు పెట్టనుంది. ఇది రూ. 60,000 కోట్లను పెట్టుబడిగా పెట్టనుంది. 3. కంట్రోల్ ఎస్ (%క్‌తీశ్రీూ%): తెలంగాణలో అత్యాధునిక ఏఐ డేటాసెంటర్ క్లస్టర్‌ను ఏర్పాటు చేయనుంది. ఇది 400 మెగా వాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్ ఏర్పాటు కానుంది. ఇది రూ. 10,000 కోట్ల పెట్టుబడి పెట్టనుండగా 3,600 మందికి ఉపాధి లభించనుంది.4. జేఎస్‌డబ్ల్యూ సంస్థ: రాష్ట్రంలో మానవ రహిత ఏరియల్ సిస్టమ్స్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయనుంది. తెలంగాణ అభివృద్ధిలో ఈ ప్రాజెక్టు క్రియాశీలంగా మారనుంది. ఈ కంపెనీ రూ.800 కోట్ల పెట్టుబడులు పెట్టనుండగా 200 ఉద్యోగాలు లభించనున్నాయి. 5. స్కైరూట్ ఏరోస్పేస్: తెలంగాణలో ఇంటిగ్రేటెడ్ ప్రైవేటు రాకెట్ తయారీ, ఇంటిగ్రేషన్, టెస్టింగ్ యూనిట్ ఏర్పాటు చేయనుంది. ఈ కంపెనీ రూ.500 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. 6. మేఘా ఇంజనీరింగ్ రాష్ట్ర ప్రభుత్వంతో మూడు కీలక ఒప్పందాలు చేసుకుంది. ఈ కంపెనీ రాష్ట్రంలో 2,160 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ఇంధన ఉత్పత్తి ప్రాజెక్ట్‌తో పాటు బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్‌ను ఏర్పాటు చేయనుంది. అనంతగిరిలో వరల్డ్ క్లాస్ లగ్జరీ వెల్‌నెస్ రిసార్ట్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ కంపెనీ రూ.15,000 కోట్ల పెట్టుబడులు పెట్టనుండగా, 5,250 మందికి ఉపాధి కల్పించనుంది. 7. హెచ్‌సిఎల్ టెక్ సెంటర్: హైటెక్ సిటీలో3.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హెచ్‌సిఎల్ కొత్త క్యాంపస్‌ను ఏర్పాటు చేయనుంది. దీనివల్ల 5,000 మందికి ఉపాధి కలుగనుంది.
8. విప్రో : హైదరాబాద్‌లో విప్రో కంపెనీ విస్తరణ చేపట్టాలని నిర్ణయించింది. గోపనపల్లి క్యాంపస్‌లో కొత్త ఐటీ సెంటర్‌ను ఏర్పాటు చేయడం వల్ల 5,000 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. 9. ఇన్ఫోసిస్: హైదరాబాద్‌లో ఇన్ఫోసిస్ క్యాంపస్ విస్తరణ చేయనుంది. పోచారంలో ఐటీ క్యాంపస్‌లో కొత్త సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ కంపెనీ రూ. 750 కోట్ల పెట్టుబడులు పెట్టనుండగా 17,000ల మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. 10. యూనిలివర్ కంపెనీ: కామారెడ్డి జిల్లాలో పామాయిల్ ఫ్యాక్టరీ, రిఫైనింగ్ యూనిట్ ఏర్పాటుతో పాటు రాష్ట్రంలో బాటిల్ క్యాప్‌లను ఉత్పత్తి చేసే కొత్త తయారీ యూనిట్ ఏర్పాటు చేయనుంది. దాదాపు వెయ్యి ఉద్యోగాలు ఈ కంపెనీ వల్ల లభించనున్నాయి. 11. టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్స్: హైదరాబాద్‌లో ఆధునిక డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. ఈ కంపెనీ 300 మెగావాట్ల సామర్థ్యంతో ఈ సెంటర్ ఏర్పాటు చేయనుంది. సుమారుగా రూ.15,000 కోట్ల పెట్టుబడులను పెట్టనుంది. 12. ఉర్సా క్లస్టర్స్ : అమెరికాకు చెందిన మరో కంపెనీ ఉర్సా క్లస్టర్స్ ఆధునిక అర్టిఫిషియల్ డేటా సెంటర్ హబ్‌ను స్థాపించనుంది. ఈ కంపెనీ రూ. 5,000ల కోట్ల పెట్టుబడులు పెట్టనుంది.13. బ్లాక్‌స్టోన్ : ప్రపంచ అగ్రగామి సంస్థ బ్లాక్‌స్టోన్ హైదరాబాద్‌లో 150 మెగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. ఈ కంపెనీ రూ.4,500 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. 14.అక్షత్ గ్రీన్ టెక్ (మైత్రా ఎనర్జీ గ్రూప్ కంపెనీ) : ఆధునిక సోలార్ సెల్స్, మాడ్యూల్స్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ కంపెనీ రూ.7,000 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. 15.ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్ : ఆరోగ్య సంరక్షణలో ప్రపంచంలో పేరొందిన ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్ కంపెనీ దాదాపు 800 మంది ఉద్యోగులకు సదుపాయముండేలా హైదరాబాద్‌లో కొత్త ఆఫీసు ఏర్పాటు చేయనుంది. 16.సుహానా మసాలా, ఎకో ఫ్యాక్టరీ ఫౌండేషన్: సంగారెడ్డిలో ప్రస్తుతమున్న సుహానా ప్లాంట్ పక్కనే కొత్తగా ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటుచేయనుంది. 17.రాంకీగ్రూపు: డెవలప్‌మెంట్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రీయల్ పార్క్‌తో పాటు డెవలప్‌మెంట్ ఆఫ్ ఎకో టౌన్ అండ్ డ్రైపోర్టు ఏర్పాటు చేయనుంది. దీనికి కోసం ఈ సంస్థ రూ.5వేల కోట్లను పెట్టుబడిగా పెట్టనుంది. 18.ఫెనోక్స్: ఈ సంస్థ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంటీరియర్ డిజైనింగ్ ఫెసిలిటీ సంస్థను ఏర్పాటు చేయనుంది. దీనికోసం రూ.250 కోట్లను పెట్టుబడిగా పెట్టనుంది.19.ఎజిలిటీ: ఈ సంస్థ తెలంగాణలో అగ్రిటెక్ హబ్‌ను ఏర్పాటు చేయడానికి రాష్ట్రంలో రూ.400 కోట్లను పెట్టుబడిగా పెట్టనుంది.20.సిఫీ: ఈ సంస్థ 200 మెగావాట్ల డేటా సెంటర్‌తో పాటు ఏఐ హబ్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ సెంటర్‌లను వరంగల్‌తో పాటు వేరే ప్రాంతంలో ఏర్పాటు చేయడానికి రూ.10 వేల కోట్లను పెట్టుబడిగా పెట్టనుంది.

# ఏకపక్షంగా కూల్చివేతలు మంచివికావు : దానం నాగేందర్



హైదరాబాద్:జనవరి 23(జర్నలిస్ట్ వార్త):హైదరాబాద్ నగరంలో ఫుట్‌పాత్‌లు ఆక్రమించి చిరువ్యాపారులు ఏర్పాటు చేసుకున్న షెడ్లను కూల్చివేతలపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మరోసారి స్పందించారు. కూల్చివేతలపై అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఆదర్శ్‌నగర్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మీడియాతో మాట్లాడిన దానం.. పేద ప్రజల జీవనాధారాన్ని అధికారులు ధ్వంసం చేస్తున్నారని ఫైరయ్యారు. నిజంగా రోడ్లకు ఇబ్బంది ఉన్న చోట్ల కూల్చివేతలు చేపడితే ఎటువంటి నష్టం లేదని అన్నారు. కానీ అధికారులు అడ్డగోలుగా కూల్చివేతలు చేపడుతున్నారన్నారు. ఈ కూల్చివేతల విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. చిరు వ్యాపారులు పొట్టకూటి కోసం షెడ్లు ఏర్పాటు చేసకుంటే వాటిని కూల్చేయటం దుర్మార్గం అన్నారు. వాటిని కూల్చేస్తే వారికి బతుకుదెరువు ఏంటని ప్రశ్నించారు. రేవంత్ సీఎం అయిన తొలినాళ్లలో ఐటీసీ కోహినూర్ వద్ద కుమారి ఆంటీకి కూడా ఇలాంటి పరిస్థితే ఎదురైందని చెప్పారు. సీఎం రేవంత్ జోక్యం చేసుకొని ఆమె జోలికి వెళ్లొద్దని చెప్పినట్లు గుర్తు చేశారు. కుమారి ఆంటీ లాగే ఇతర వ్యాపారుల జోలికి వెళ్లొద్దని దానం కోరారు. ఒకవేళ పాలసీ కింద కూల్చివేతలు చేపడితే.. ముందు పాతబస్తీలో కూల్చివేతలు చేపట్టాలన్నారు. అలా చేస్తే.. తాను కూడా సహకరిస్తానని అన్నారు. కూల్చివేతలు చేపడితే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్నారు. కూల్చివేతల కారణంగా తమకు నిద్రకూడా పట్టడం లేదని దానం వ్యాఖ్యనించారు.

# సుప్రీంకు జలజగడం

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం ప్రకారం కృష్ణానదీ జలాల విభజనలో తెలంగాణకు కనీ సం యాభై శాతం నీటి కేటాయింపులు జరపాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోరుతుంది. అందుకు గల కారణాలను కూడా కేంద్ర ప్రభుత్వానికి, కృష్ణా నదీ రివర్ బోర్డు కు తెలియజేసింది. దానిపై రెండు రాష్ట్రాల మధ్య వివాదం పరిష్కారానికి కేంద్ర ప్రభు త్వం చొరవ చూపుతున్నది. కృష్ణా ట్రైబ్యునల్ నీటి పంపకాల వ్యవహారంపై సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం మెన్షన్ చేసింది. ట్రై బ్యునల్ ముందు దాఖలైన రెండు రిఫరెన్స్‌ల విచారణ వ్యవహారంపై సుప్రీంకోర్టును ఏపీ ప్రభుత్వం ఆశ్రయించింది. కృష్ణా ట్రిబ్యునల్‌పై సుప్రీంకోర్టులో ఫిబ్రవరి 13న విచార ణ జరగనుంది. 2023 అక్టోబర్ 23వ తే దీన విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ పై బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ ఇటీవల ఒక ని ర్ణయం తీసుకుంది.విభజన చట్టం ప్రకారం నీటి వాటాల పంపకంపై రెండు రిఫరెన్స్‌ల ను ట్రిబ్యూనల్‌లో రెండు తెలుగు రాష్ట్రాలు దాఖలు చేశాయి.మహారాష్ట్ర, కర్నాటక, ఆం ధ్రప్రదేశ్ మధ్య నీటి పంపకాలు చేస్తూ ఇప్పటికే బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ తీర్పు వెలువరించింది. అయితే2014లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవిభజన తర్వాత తలెత్తిన కృష్ణా నదీ నీ టి పంపకాలపై తెలంగాణ ప్రభుత్వం ట్రిబ్యూనల్‌ను ఆశ్రయించింది. కృష్ణానది తమ భూభాగంలోనే ఎక్కువ ప్రవహిస్తుంది కాబట్టి రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తమకు 70 శాతం నీటి వాటా కేటాయించాలని, సాధ్యం కానిపక్షంలో రెండు రాష్ట్రాలకు 50 శాతం చొప్పున అయినా నీటిని పంపిణీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది. దీనిపై ట్రిబ్యూనల్ తుది నిర్ణయం వెలువరించకముందే కేంద్ర ప్రభుత్వం 2023 అక్టోబర్ 10న నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఏపీ, తెలంగాణ మధ్యనే నీటి పంపకాలను తేల్చాలని, దానిపైనే విచారణ చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది.కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. తమ ముందు ఉన్న రెండు రిఫరెన్స్‌లలో 2023లో కేంద్రం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ రిఫరెన్స్ పైనే ముందుగా విచారణ చేపడుతామని ఈనెల 16న కృష్ణా ట్రైబ్యునల్ తేల్చి చెప్పింది. ట్రైబ్యునల్ తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం ప్రస్తావించింది. ఫిబ్రవరి 19న ట్రైబ్యునల్ రెండు రిఫరెన్స్‌లనే విచారణకు తీసుకుంటామని చెప్పిన విషయాన్నిసుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లింది. తమ పిటిషన్‌పై త్వరగా విచారణ చేపట్టాలని ఏపీ న్యాయవాదులు కోరారు. ఏపీ ప్రభుత్వం ప్రస్తావనను జస్టిస్ సూర్యకాంత్ , జస్టిస్ కోటేశ్వర్ సింగ్‌ల ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. ఫిబ్రవరి 13న మధ్యాహ్నం 2గంటలకు తదుపరి విచారణను చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు ప్రకటించింది.

# మేయర్, డిప్యూటీ మేయర్‌లపై అవిశ్వాస తీర్మానం

.(మొదటి పేజీ తరువాయి)

ఇకనుంచి ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు. లక్షల సంఖ్యలో రేషన్ కార్డుల అప్లికేషన్లు వచ్చాయి.. దరఖాస్తు చేసుకున్న వారికి రేషన్ కార్డులు ఇవ్వాలని తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులకు సంబంధించిన ప్రోటోకాల్‌ను ఎందుకు పాటించడం లేదని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యేలకు చెప్పకుండానే శంకుస్థాపనలు ఎలా చేస్తున్నారని నిలదీశారు. అధికారులు తమ ఫోన్లు ఎత్తడం లేదు.. తమ నెంబర్లు బ్లాక్ చేస్తున్నారని ఆరోపించారు. వైకుంఠ ధామాల నిర్మాణాలు మధ్యలో ఆగిపోయాయని చెప్పారు. ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడుతున్నా ఇన్నిరోజులు తాము ఎలాంటి ఆందోళన చేయలేదని అన్నారు. జీహెచ్ఎంసీ కౌన్సిల్‌లో తమ పార్టీ సభ్యులే మెజార్టీ సంఖ్యలో ఉన్నారు.. అయినా తమ సభ్యుల ప్రశ్నలు ఎందుకు పట్టించుకోవడం లేదని తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రశ్నించారు.

# ప్రపంచానికి మార్గదర్శిగా భారత్

## పలు కంపెనీలతో సిఎం చంద్రబాబు వరుస భేటీలు - వేలకోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు






అమరావతి,:జనవరి 23(జర్నలిస్ట్ వార్త)::ప్రస్తుతం భారతదేశం ప్రపంచంలో అత్యుత్తమ స్థానంలో ఉందని ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఆర్థిక సంస్కరణలు, సరైన సమయంలో సాంకేతికత అందిపుచ్చుకోవాలని సూచించారు. జనాభా వైవిధ్యం, సుస్థిర వృద్ధిరేటు, పటిష్టమైన విధానాలతో పాటు సరైన నాయకత్వంతో ఇండియా బ్రాండ్ బలంగా ఉందని పేర్కొన్నారు. దావోస్‌లో మూడో రోజు సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఎపి బృందం ప్రఖ్యాత కంపెనీల సిఇఒలు, సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. భారత దేశం బ్రాండ్ ఇప్పుడు చాలా స్ట్రాం÷-రగ్ గా ఉందని, దావోస్ లో వివిధ రాష్ట్రాలు పెట్టుబడుల కోసం పోటీపడుతున్నాయని తెలియజేశారు. దేశం కోసం అందరం కలిసి పని చేస్తున్నామని, సిఎంలుగా వేర్వేరు పార్టీలకు చెందినా, ప్రజల కోసం ఐక్యంగా ఆలోచిస్తామని బాబు వివరించారు. మేమంతా వేర్వేరు రాజకీయ పార్టీలకు చెందిన వారిమైనప్పటికీ భారత్ కోసమే పని చేస్తున్నామన్నారు. తాము దావోస్ నుంచి టెక్నాలజీని తీసుకెళ్లడానికి రాలేదని, ప్రపంచానికే మా దేశం టెక్నాలజీని అందజేస్తోందని, అది మా భారతీయుల సత్తా అని ప్రశంసించారు. ఇప్పుడు ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తోందని, గ్రీన్ హైడ్రోజన్, పునరుత్పాదక ఇంధన రంగంలో భారత్ విశేష కృషి చేస్తోందని బాబు స్పష్టం చేశారు. దాదాపు అన్ని టెక్ కంపెనీల సిఇఒలు భారత సంతతికి చెందినవారే ఉన్నారని, సాంకేతికతను ముందుగా అందిపుచ్చుకున్న దేశంగా భారత్ ప్రయోజనాలు పొందుతోందన్నారు. వ్యాపార దక్షత, నైపుణ్యాలు ఉన్న యువత, జనాభా ఎక్కువగా ఉండటం భారత్ కు వరాలని సంతోషం వ్యక్తం చేశారు. ప్రపంచం మొత్తానికి ఇండియా సేవలందిస్తోందని, ప్రపంచంలో అన్ని ప్రాంతాల ప్రజలకు అత్యంత ఆమోదయోగ్యులు భారతీయులే ఉన్నారని చంద్రబాబు తెలియజేశారు.

# రాహుల్ గాంధీకి అస్వస్థత

జనవరి 23(జర్నలిస్ట్ వార్త):



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అస్వస్థతకు గురయ్యారు. అనారోగ్య కారణాలతో ఆయన నేడు ఢిల్లీ ఎన్నికల ప్రచారాన్ని కూడా రద్దు చేసుకున్నారు. ఢిల్లీలోని ముస్తఫాబాద్ లో రాహుల్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించాల్సి ఉంది. అయితే వైద్యుల సూచనల మేరకు రాహుల్ ఎన్నికల ప్రచారాన్ని రద్దు చేసుకున్నారని కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్ తెలిపారు. రేపు షెడ్యూల్ ప్రకారం మాదిపూర్ లో ఎన్నికల ర్యాలీ జరుగుతుందని చెప్పారు. భారీ బహిరంగసభలో ఆయన ప్రసంగించే అవకాశం ఉందని తెలిపారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో తాము ఏ పార్టీకి మద్దతు ఇవ్వడం లేదని... ఒంటరిగానే పోటీ చేస్తున్నామని చెప్పారు. రిపబ్లిక్ డే తర్వాత రాహుల్, ప్రియాంక సహా ఇతర నేతలు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేస్తారని తెలిపారు.

# అర్హులైన వారందరికీ కార్డులు..ఇందిరమ్మ ఇళ్లు


## మరోమారు స్పష్టం చేసిన మంత్రి పొన్నం

కరీంనగర్,జనవరి 23(జర్నలిస్ట్ వార్త):: రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో మంత్రులుగా తమ జోక్యం ఉండదని, న్యాయంగా అర్హులైన వారందరికీ మంజూరు చేస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. అధికారులు ప్రజాపాలన సభల్లో ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులు స్వీకరించి అర్హులను గుర్తిస్తారని మంత్రి తెలిపారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ 15వ వార్డులో ప్రజాపాలన కార్యక్రమాన్ని పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. రేషన్ కార్డుల జారీ పక్రియ నిరంతరం జరిగేలా సాఫ్‌వేర్ రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు. రూ.2 లక్షలకు పైగా ఇంకా రుణమాఫీ కాని రైతులకు మార్చి నెలలో షెడ్యూల్ పెట్టి రుణమాఫీ చేస్తామని చెప్పుకొచ్చారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు అందరికీ ఉందని, ముందు సమస్యలను అధికారులు, తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజా సమస్యలు పరిష్కరించడం తన బాధ్యతంటూ మంత్రి పొన్నం చెప్పారు.

# లబ్ధిదారుల జాబితా పై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి

## - ఆర్డీవో ఎం. రాజేంద్ర గౌడ్





తల్లాడ/జనవరి23(జర్నలిస్ట్ వార్త): ప్రభుత్వ పథకాల అమలు నిరంతరం ప్రక్రియ అని కల్లూరు ఆర్డీవో రాజేందర్ గౌడ్ అన్నారు. గురువారం తల్లాడ పంచాయతీ కార్యాలయం ముందు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, నూతన రేషన్ కార్డు ల పై గ్రామ సభ నిర్వహించారు. తల్లాడ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కల్లూరు ఆర్డీవో ఎం రాజేంద్ర గౌడ్, తాసిల్దార్ వనజ, ఎంపీడీవో చంద్రమౌళి,ఎస్సై బి. కొండలరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల ఉద్దేశించి ఆర్డీవో మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో భాగంగా జాబ్ కార్డులుమొత్తం 1860 ఉన్నాయి అందులో 1250 కార్డులు వినియోగంలో ఉన్నాయి ఇందిరమ్మ ఇళ్లకు మొత్తం సర్వే చేసిన ఇల్లు 2074 అందులో 419 మంది అర్హులుగా గుర్తించడం జరిగిందన్నారు.రేషన్ కార్డు కొరకు కొత్త దరఖాస్తులు 23 3 రేషన్ కార్డు లో పేర్లు చేర్చుకొనుటకు దరఖాస్తులు 154 వచ్చాయని అంతేకాక రైతు భరోసా పథకానికి 24 11 మంది అర్హులుగా గుర్తించడం జరిగిందని తెలిపారు.ప్రాథమిక జాబితాలో అర్హులు గా ఉండి పేర్లు రానివారు మరల ఎంపీడీవో తాసిల్దార్ కార్యాలయంలో ఉన్న ప్రజా పాలన కేంద్రాలలో మరల దరఖాస్తు చేసుకోవాలని ప్రజలకు సూచించారు.ఇప్పుడు ప్రకటించిన లిస్టులో పేర్లు ఉన్న వారందరూ అర్హులు కాదని కొత్తగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని అన్నారు. గ్రామంలో అసైన్మెంట్ భూములు కు రైతు భరోసా రావడం లేదని అదే విధంగా ఉపాధిహామీ కూలీలకు పని కల్పించడం లేదని ఆర్డీవో దృష్టికి కొందరు తీసుకువెళ్లగా తాసిల్దార్ ఎంపీడీవోలకు దరఖాస్తులు చేసుకోవాలని పరిశీలించిన అధికారులు అర్హులైన వారికి ఆ పథకాలు అమలు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తల్లాడ గ్రామపంచాయతీ ఈవో కృష్ణారావు,
ఆర్ఐ భాస్కరరావు, ఏఈవోలు పంచాయతీ కార్యదర్శులు ప్రజాప్రతినిధులు గ్రామపంచాయతీ , అంగనవాడి ఆశా వర్కర్ల తదితరులు పాల్గొన్నారు.

# సాయి బాబా గుడిలో అన్నదానం ను ప్రారంభించిన చైర్మన్ ఊటుకూరి శ్రీనివాసరావు




ఖమ్మం/జనవరి23(జర్నలిస్ట్ వార్త):నగరంలోని మామిళ్ళగూడెం సాయిబాబా దేవాలయంలో ప్రతినెలా చివరి గురువారం అన్నదానం కార్యక్రమం లో భాగంగా సాయి బాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి. అనంతరం మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమం ను సాయిబాబా గుడి చైర్మన్, ప్రముఖ న్యాయవాది ఊటుకూరి శ్రీనివాసరావు భక్తులకు అన్నం వడ్డించి ప్రారంభించారు. ఈ సందర్భంగా రెండు వేలమంది భక్తులకు మరియు పెద్దతండా లోని సాయి బాబా ఆశ్రమం లో అన్నదానం నిర్వహించారు.
ఈ కార్యక్రమం లో డివిజన్ కార్పొరేటర్ బుడిగం శ్రీనివాసరావు, సాయి బాబా భక్తులు సత్యం సింగ్, వనం రవి కుమార్, జక్కుల వెంకటరమణ, కొప్పెర సునీత, బిల్డర్ అక్కునపల్లి రామకృష్ణ, ఎల్.ఐ.సి రవి, పాలవెల్లి సునీల్. అనూప్, పవన్, జూపెల్లి రవి, కృష్ణ, రవి, కోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి చేయూత ఫౌండేషన్ ఆర్థిక సహాయం




రాయపర్తి/జనవరి23 (జర్నలిస్ట్ వార్త): మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీ కి చెందిన జలగం లావణ్య - రవి దంపతుల కుమారుడు అన్వేష్ న్యూమోనియా,గుండె సంబంధిత వ్యాధి తో బాధపడుతుండగా అన్వేష్ వైద్య ఖర్చుల నిమిత్తం కుటుంబానికి గురువారం చేయూత ఫౌండేషన్ సభ్యులు ఐదు వెల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. చేయూత ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఆపదలో వున్నా ప్రజలకూ అండగా నిలిచి చేయూత నివ్వడంమే ఫౌండేషన్ ధ్యేయం అని అన్నారు.బడుగుబహీనవర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్న చేయూత ఫౌండేషన్ ప్రతినిధులకు అన్వేష్ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు ఐత సంపత్, ఐత మారుతి, ఐత శ్రీనివాస్ , ఐత మల్లేష్, నల్ల యాకయ్య, ఐత బాబు, ఐత రాజు,ఐత రమేష్ బాబు, ఐత నరేష్ , ఐత భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులు ఆందోళన చెందొద్దు




రాయపర్తి/జనవరి 23(జర్నలిస్ట్ వార్త): నిరంతరం అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని,పథకాల విషయంలో ఎవ్వరు కూడా ఆందోళన చెందో ద్దని ఎంపీడీవో జి కిషన్ అన్నారు.గురువారం మండలంలోని బురహన్ పల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఇల్లు,ఇందిరమ్మ రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు అర్హులైన లబ్ధిదారులందరికి అందుతాయని అన్నారు.అర్హుల జాబితాలో పేరు రాక పోతే గ్రామ పంచాయతీ కార్యదర్శి కి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమం లో స్పెషల్ ఆఫీసర్ పోగుల దెబోరా, పంచాయతీ కార్యదర్శి ఇల్లందుల అంబేద్కర్, ఏఈఓ కావ్య, జూనియర్ అసిస్టెంట్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

# చిల్లాపురంలో ప్రశాంతంగా గ్రామసభ



నల్లగొండ/జనవరి 23(జర్నలిస్టు వార్త): గురువారం మిర్యాలగూడ మండలం చిల్లాపురం గ్రామంలో ప్రశాంతంగా గ్రామ సభజరిగింది,అధికారులు అర్హత గల లబ్ధిదారుల పేర్లను చదివి వినిపించారు,అభ్యంతరాలను స్వీకరించారు ఇంకా అర్హులైన వారు పేదలు ఉన్నట్లయితే దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. అర్హత గల వారి సంఖ్య రేషన్ కార్డులు - దరఖాస్తులు, ఇందిరమ్మ ఇండ్లకు- దరఖాస్తులు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కు - దరఖాస్తులు ఇచ్చారని ప్రత్యేక అధికారి రామకృష్ణ తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి జిల్లా రామ్మోహన్ ప్రభుత్వ అగ్రికల్చర్ ఆఫీసర్ షఫీ. అధికారులు,కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడుఅనుముల శ్రీనివాస్, తాజా మాజీ సర్పంచ్ మలికంటి రేణు బాబు, తాజా మాజీ ఉపసర్పంచ్ జానపాటి, వెంకన్న, జానపాటి శ్రీను (డీలర్) కోట్ల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తల్లాడ లో ఘనంగా నారా లోకేష్ జన్మదిన వేడుకలు





తల్లాడ/జనవరి23(జర్నలిస్ట్ వార్త): తల్లాడ పట్టణం లో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ విద్యా ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ , 42వ జన్మదిన వేడుకలు గురువారం తల్లాడ లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నారా లోకేష్ , కి జన్మదిన శు భాకాంక్షలు తెలిపి కేక్ ను టీడీపీ మండల నాయకులు మాజీ వైరా ఏఎంసి వైస్ చైర్మన్ దూపాటి భద్రరాజు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో టీడీపీ నాయకులు సరికొండ శ్రీనివాసరాజు,నారపోగు ప్రసాద్,వెంకటి, పెద్దబ్బాయ్, రామక్రిష్ణ,తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో అర్హులైన లబ్ధిదారులకు ఏ పథకం అందలేదు

## - బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తూళ్ల కుమారస్వామి



వర్ధన్నపేట/జనవరి 23(జర్నలిస్ట్ వార్త): సంవత్సర కాలంగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఇప్పటివరకు అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి పథకం అందలేదని గురువారం బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తూళ్ల కుమారస్వామి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆరు గ్యారెంటీ పథకాలను ప్రవేశపెట్టిన సంగతి ప్రజలకు తెలుసు అన్నారు. అందులో ముఖ్యమైనవి సంవత్సర కాలంలో ఒక్క ఇల్లు నిర్మించలేదు. కొత్త రేషన్ కార్డులు, అర్హులైన వారికి కొత్త పెన్షన్స్ ప్రవేశపెట్టిన దాఖలాలు లేవన్నారు. హంగు ఆర్భాటాలతో గ్రామీణ ప్రాంతాలవారీగా గ్రామ సభలు నిర్వహిస్తూ, ప్రజలను నమ్మించే విధంగా ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేదన్నారు. సంవత్సర కాలంలో కాంగ్రెస్ పార్టీ పరిపాలన విధానాన్ని ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. పిల్లి గుడ్డిదైతే ఎలుక ఎగిరి గంతులు వేసింది అన్న చందంగా ప్రజలు గమనించడం లేదన్న ఆలోచనతో కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత హామీలను ప్రవేశపెట్టి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం వ్యర్థమని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రస్తుతం ప్రవేశపెట్టిన పథకాలను పంపిణీ చేసే క్రమంలో గ్రామీణ ప్రాంతాలలో తలపెట్టిన గ్రామసభల వారిగా లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

# లింగన్నపాలెం లో విజయవంతంగా ముగిసిన గ్రామసభ








వైరా/ జనవరి23(జర్నలిస్ట్ వార్త): వైరా నియోజవర్గం లోని లింగలపాలెం గ్రామం విజయవంతంగా గ్రామసభ ముగిసింది గురువారం గ్రామ సభను స్పెషల్ ఆఫీసర్ కొత్తపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 21 నుండి 23వ తారీకు వరకు జరిగే గ్రామ సభలు జరుగుతున్నాయన్నారు.
ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, అంశాల పై గ్రామసభ నిర్వహించారు.నూతన రేషన్ కార్డులు అమలు చరస్తున్నట్లు తెలిపారు. గ్రామ సెక్రెటరీ పురుషోత్తరావు, అంశాలను అర్హులైన వారి పేర్లు చదివి వినిపించారు. ఈరోజు నుండి అర్హుల జాబితాలో పేర్లు రానివారు తిరిగి మరల అప్లై చేసుకోవచ్చు అని త్వరలో అందరికీ పూర్తి జాబితా వస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సైదులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఫీల్డ్ అసిస్టెంట్, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, అంగన్వాడి టీచర్లు, వివోఏలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

## - వర్ధన్నపేట యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు



వర్ధన్నపేట/జనవరి 23(జర్నలిస్ట్ వార్త): పేద ప్రజల కోసం ప్రభుత్వం మరో నాలుగు కొత్త పథకాలు ఈనెల 26న, ప్రారంభించేందుకు సిద్ధమైందని గురువారం వర్ధన్నపేట యువజన కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు కుల్ల యాకాంతం తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు ఈనెల 21 నుండి 24 వరకు గ్రామ సభలు నిర్వహించి, లబ్ధిదారులు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని వారు వెంటనే గ్రామసభలో దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. ఒకవేళ గ్రామ సభలో కుదరకపోతే, సంబంధిత అధికారులతో ఈ ప్రక్రియ కొనసాగుతుందని అన్నారు. ఈనెల 26న, రైతు భరోసా పంట పెట్టుబడి సాయం, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారుల జాబితా తయారీకి ప్రభుత్వం క్షేత్రస్థాయిలో సర్వే పూర్తి చేసింది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద రైతు కూలీలకు ఏడాది రూపాయలు 12 వేల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందించనుందన్నారు. ఇందిరా మహిళా పథకంలో లబ్ధిదారులకు విడతల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూపాయలు 6 లక్షలు ఇవ్వనుందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు సవరణ చేయనున్నారు. ఎవరు అధైర్యపడవద్దు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన కొంతకాలానికి అర్హులైన సభ్యులందరికీ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడం జరుగుతుందని యాకాంతం ప్రభుత్వాన్ని కొనియాడారు. కులాల సర్వే (కుల గణన) ఆధారంగా రూపొందించిన జాబితాను క్షేత్రస్థాయిలో పరిశీలనకు పంపారు. నిర్ణీత ధ్రువీకరణ తర్వాత అర్హులైన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డు జారీ చేయడం జరుగుతుందన్నారు. మీసేవ ద్వారా కుటుంబ సభ్యుల చేర్పుల కొరకు దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను కూడా పరిశీలించడం జరుగుతుందని ప్రజావాణిలో వచ్చిన అన్ని దరఖాస్తులను అర్హత ప్రమాణాల ప్రకారం పరిశీలన జరుగుతుందని తెలిపారు. అర్హులైన లబ్ధిదారుల అందరికీ కొత్త రేషన్ కార్డు అందించడానికి ప్రభుత్వ కృషి చేస్తుందన్నారు. ఎవరూ ఎటువంటి అనుమాన పడవద్దని అన్నారు.

# బడ్జెట్ ప్రజలఆకాంక్షలు అందుకునేనా ?

జనవరి 23(జర్నలిస్ట్ వార్త): మరికొన్ని రోజుల్లో పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాబోతున్నాయి. ఫిబ్రవరి1న బడ్జెట్ ప్రవేశ పెట్టేందుకు ఆర్థికమంత్రి నిర్మలా సీతారమన్ మరోమారు సిద్దంగా ఉన్నారు. ఎప్పటిలాగే ఈ సారి బడ్జెట్ సమావేశాలు ఉంటాయా లేక మరేమైనా అద్భుతాలు ఉంటాయా అన్నది ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఎందుకంటే ఇన్‌కమ్ ట్యాక్స్, జిఎస్టీ, నిరుద్యోగం, రూపాయి పతనం, ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల వంటివి దేశాన్ని పట్టిపీడిస్తున్నాయి. ఈ క్రమలంఓ అధికార, విపక్షాలు బాధ్యతగా ముందుకు సాగాల్సిన సమయమిది. పార్లమెంట్ అనగానే విమర్శలు, ప్రతి విమర్శలతో కాలయాపన చేయడం, వాకౌట్లు చేయడం, ఆందోళనలకు దిగడం సరికాదు. మారుతున్న కాలానుగుణంగా ప్రజల అవసరాల మేరకు ప్రతిపక్షాలు ఆయా అంశాలపై చర్చలు జరిగి ప్రభుత్వం నుంచి సమాధానం రాబట్టే ప్రయత్నాలు చేయాలి. పార్లమెంటులో ఒకకో సమస్యపై చర్చకు ఒక్కో విధానం ఉంది. అంతేతప్ప తాము పట్టిన కుందేటికి మూడే కాళ్లు అన్న చందంగా విపక్షం వ్యవహరించరాదు. ఇక అధికార పక్షం కూడా తామంతా గత పదేళ్లుగా బ్రహ్మాండంగా పనిచేశామని, భారత్‌ను ఉద్ధరించామన్న ధోరణి నుంచి బయటపడాలి. ప్రజలు ఏం కోనుకుంటున్నారో గుర్తించాలి. అంతర్గత చర్చలకు అవకాశం ఇవ్వాలి. వికసిత భారత్ లక్ష్యంగా పదేళ్లుగా మోడీ నేతృత్వంలోని బిజెపి పాలన సాగుతున్నా..ప్రజల్లో మాత్రం వికసిత జీవితాలు కనిపించడం లేదు. గత 20 ఏళ్ల కాలానికి పోలిస్తే దేశంలో అభివృద్ధి అన్నది ఎండమావి అన్న విమర్శలు ఉన్నాయి. కార్పోరేట్లకే బిజెపి అనుకూలం అన్న ప్రచారం బలంగా ఉంది. పేదల అభివృద్ధి అటేనే దేశ అభివృద్ధి. భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతోందంటే పేదలు బాగుపడాలి. కానీ పేదలు మరింత పేదలుగా మారుతున్నారు. మధ్యతరగతి ప్రజలు పేదరికంలోకి నెట్టివేయబడుతున్నారు. ఫ్రీ రేషన్‌తో ఆహార సమస్య తీరిందని పేర్కొనడంతోనే దేశం ఏ మేరకు అభివృద్ధి చెందిందో చర్చించాలి. ధరల పెరుగుదలను చూస్తుంటే ప్రబుత్వాలు ఎంత అధ్వాన్నంగా పాలన చేస్తున్నాయో గమనించాలి. నిత్యాసవర ధరలు, ఔషధాల ధరలు అడ్డదిడ్డంగా పెరుగుతున్నాయి. గ్రామీణ ప్రజల ఆర్థిక వికాసం సాధ్యం అవుతోందని చెప్పడం కన్నా, గ్రామాలకు వెళ్లి నిరూపించాలి. ఎంపిలు డూడూ బసవన్నల్లాగా తలూపకుండా సమస్యల పై చర్చించాలి. కోట్లాది మంది రైతులకు నేరుగా నగదు బదిలీ చేస్తున్నామంటేనే వారికి తగిన గిట్టుబాటు ధరలు, సకాలంలో రుణాలు, వ్యవసాయ పనిముట్లు అందడం లేదని అర్థం చేసుకోవాలి. ఇన్ని సమస్యలను చర్చించకుండా బడ్జెట్‌లో అంతా బాగుందని చెప్పడం ద్వారా భారత్ వెలిగిపోతోందని అంటే నమ్మడానికి ప్రజలు సిద్దంగా లేరని గుర్తించాలి. అందుకే బడ్జెట్‌లో విస్తృత చర్చ జరగాలి. అలాగే సామాన్యులు బతకడమెలా అన్నది



పాలకులు ఆలోచించినప్పుడే దేశ ఆర్థికవృద్ధి సాధ్యం కాగలదు. సామాన్యుడు తనకుతానుగా బతకగలిగి నప్పుడే నిజమైన అభివృద్ధికి గీటురాయిగా చూడాలి. వచ్చే ఐదేళ్లలో భారత్ అద్భుతమైన ప్రగతి సాధించ బోతుందని మోడీ సహా నేతలంతా పేర్కొంటూ..రాజకీయ పబ్బం గడుపుతున్నారు. విజన్ డాక్యుమెంట్ల పేరుతో ఇంకెంతోకాలం వంచించలేదు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడ మే లక్ష్యంగా పనిచేస్తున్నామంటున్న వారు అందుకు తగ్గట్లుగా ప్రణాళికలు సిద్దంచేయాలి. గత పదేళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశాం అని మోడీ చెప్పారు. అలాగే 80 కోట్ల మందికి ఉచిత రేషన్ అందిస్తున్నామని చెప్పారు. నిజానికి అభివృద్ధి జరిగివుంటే ఈ దుస్థితి ఎందుకని ప్రశ్నించుకోవాలి. ప్రజలు తిండిగింజలను కొనుక్కునే పరిస్థితిలో లేరని చెప్పకనే చెప్పారు. పేద మధ్య తరగతి ప్రజలకు సొంతింటి కాల ఎండమావిగా మారింది. పేదలు, మహిళలు, యువకులు, రైతులపై తమ ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోవడం లేదు. అంతెందుకు జిఎస్టీ మోతలను సంస్కరించాలను కోవడం లేదు. ఆదాయపన్నును పరిశీలించడం లేదు. ఇవన్నీ కూడా బడ్జెట్‌లో చర్చించాలి. కేవలం లెక్కలు చెప్పి బుకాయించడం కుదరదని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ గుర్తించాలి. అధికారులు వేసే లెక్కలకు తలూపడం కాకుండా క్షేత్రస్థాయి సమస్యలను చర్చించినప్పుడే వికసిత భారత్ సాధ్యం కాగలదు. జిఎస్టీ వసూళ్లు నెలకు లక్షా 40 వేల కోట్ల నుంచి లక్షా 70వేల కోట్ల వరకు చూసి మురిసిపోతున్నారు. ప్రజలు స్వచ్ఛందంగా పన్నులు కట్టలేని దుర్భర పరిస్థితుల్లో ఉన్నారు. మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత చేపట్టిన సంస్కరణలు ఫలితాలిస్తాయని ఆశించినా, జిఎస్టీ లాంటి పన్నులు మోత మోగిస్తున్న తీరు ప్రజల దివాళాను సూచిస్తోంది. దేశ ప్రజలు భవిష్యత్‌పై ఆశతో జీవిస్తున్నారు. మంచి రోజులు వస్తాయన్న నమ్మకంతో బతుకుతున్నారు. అలాంటి వారికి బడ్జెట్ స్వాంతన కావాలి. ప్రజల కొనుగోలు శక్తి పెరగాలి. రైతులకు కనీస మద్దతు ధరలు అన్నవి రావాలి. బియ్యం, ఉప్పు,పప్పుల ధరలు మాత్రం ఏటికేడు ఆకాశాన్ని అంటుతున్నాయి. పేదలు, మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వం అండలేకుండానే జీవించగలగాలి. కానీ ఈ పదేళ్లలో అలాంటి అవకాశాలు లేకుండా చేశాయి. బ్యాంక్ వడ్డీ రేట్లు దారుణంగా ఉన్నాయి. భూములు, సిమెంట్, స్టీలు ధరలను అడ్డం పెట్టుకుని బిల్డర్లు దోపిడీ చేస్తున్నారు. ఇవన్నీ కూడా బడ్టెట్ పద్దుల్లో చర్చించాల్సి ఉంది. బడ్జెట్ పద్దులు ప్రజలను ఆదుకునేలా ఉండాలి. అందమైన ఎసి గదుల్లో కూర్చుని ఆలోచిస్తే ఎన్నటికీ అంటే 2047 నాటికి కూడా ప్రజల బతుకులు బాగుపడవని గుర్తించాలి. అప్పుడే సామాన్యులకు అండగా ప్రభుత్వం ఉందన్న నమ్మకం కలుగుతుంది.

## మీర్‌పేట హత్య కేసులో విస్తుపోయే విషయాలు

### అక్రమ సంబంధంతోనే భార్యను అడ్డు తొలగించుకునే చర్య గురుమూర్తి నుంచి కూపీ లాగుతున్న పోలీసులు

హైదరాబాద్,జనవరి 23(జర్నలిస్ట్ వార్త): మీర్‌పేట సంచలన హత్య కేసులో విస్తుపోయే విషయాలు బయటికొస్తున్నాయి. మరో మహిళతో అక్రమ సంబంధంతోనే భార్యను హత్య చేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. సెల్‌ఫోన్ ద్వారా గుట్టును బయటకు తీసే ప్రయత్నంలో పోలీసులు ఉన్నారు. గురుమూర్తి తన భార్యను చంపి.. మృతదేహాన్ని ముక్కలు చేసి ఉడికించి.. ఎముకలను రోట్లో వేసి దంచి పొడిగా చేసిన ఘటన సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. రంగారెడ్డి జిల్లా మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తుండగా విస్మయకర విషయాలు వెలుగులోకి వచ్చినట్టు తెలుస్తోంది. దర్యాప్తులో భాగంగా నిందితుడు గురుమూర్తి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని పోలీసులు పరిశీలించారు. అందులో ఓ మహిళకు సంబంధించిన ఫొటోలను గుర్తించారు. ఆ మహిళతో సంబంధం కారణంగానే భార్యను అడ్డు తొలగించుకునేందుకు.. కడతేర్చి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుడు చెప్పిన వివరాలను బట్టి సాంకేతిక ఆధారాలను సేకరిస్తున్నారు. ఈనెల 15న గురుమూర్తి, అతని భార్య వెంకటమాధవి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఓ మహిళకు సంబంధించిన విషయంపైనే వారిద్దరి మధ్య గొడవ జరిగినట్టు తెలుస్తోంది. వెంకటమాధవి తలపై మోది హత్య



చేసిన తర్వాత మటన్ నరికే కత్తితో ముక్కలుగా నరికాడు. ఆ తర్వాత శరీర భాగాలను బకెట్‌లో వేసి వాటర్ హీటర్‌తో ఉడికించాడు. అనంతరం వాటిని రోకలితో దంచి మూటకట్టి చెరువులో పడేసినట్టు పోలీసులకు చెప్పాడు. అయితే, జి÷-లలెలగూడ చెరువులో పోలీసులకు ఎలాంటి ఆధారాలు లభించలేదు. కానీ, నిందితుడు చెప్పిన వివరాల ప్రకారం.. 15వ తేదీ హత్య చేసిన తర్వాత గురుమూర్తి రెండ్రోజుల పాటు మద్యం సేవిస్తూ ఇంట్లోనే ఉన్నట్టు పోలీసులు ఆధారాలు సేకరించారు. వెంకటమాధవి కనిపించడం లేదని ఆమె తల్లిదండ్రులకు 17వ తేదీ రాత్రి చెప్పాడు. దీంతో ఆందోళనకు గురైన ఆమె తల్లిదండ్రులు వెంటనే న్యూ వెంకటేశ్వర కాలనీకి వచ్చి సమీపంలో గాలించారు. చుట్టుపక్కల వారిని ఆరా తీశారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో గురుమూర్తిని తీసుకెళ్లి.. 18వ తేదీ మీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణలో భాగంగా పోలీసులు గురుమూర్తి నివాసానికి వచ్చిన తర్వాత సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించగా.. 14వ తేదీన వెంకటమాధవి బయటి నుంచి ఇంట్లోకి వెళ్లిన ఫుటేజీ ఉంది కానీ, ఆ తర్వాత బయటకు వెళ్లినట్టు ఆధారాలు దొరకలేదు. సాంకేతిక ఆధారాలను పరిశీలించిన తర్వాత పోలీసులు గురుమూర్తిపై అనుమానంతో అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా... అసలు విషయం వెలుగు చూసింది. వెంకటమాధవి శరీర భాగాలు లభ్యమైతే వారి పిల్లల డీఎన్‌ఏతో సరిపోల్చి సాంకేతిక ఆధారాలు సేకరించాలని చూస్తున్నారు. కానీ, గురుమూర్తి చెప్పిన ప్రాంతంలో ఇప్పటి వరకు మృతదేహం ఆనవాళ్లు లభ్యం కాకపోవడంతో ఈ కేసుకు సంబంధించి పోలీసులు ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. ఏపీలోని ప్రకాశం జిల్లా రాచర్ల మండలం జేపీ చెరువుకు చెందిన వెంకట మాధవి(35)కి అదే గ్రామానికి చెందిన పుట్ట గురుమూర్తి(39)తో 13 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. గురుమూర్తి ఆర్మీలో పనిచేసి పదవీ విరమణ చేసి ప్రస్తుతం డీఆర్‌డీవోలో కాంట్రాక్టు భద్రతా సిబ్బందిగా పనిచేస్తున్నాడు. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం జిల్లెలగూడ న్యూ వెంకటేశ్వరనగర్ కాలనీలో అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు.

## ప్రభుత్వ పథకాల కోసం ప్రజలు గాబరా పడవద్దు

### - అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఫలాలు అందుతాయి
### - వర్ధన్నపేట కాంగ్రెస్ ఎస్సీసెల్ మండల అధ్యక్షులు సమ్మయ్య



వర్ధన్నపేట/జనవరి 23(జర్నలిస్ట్ వార్త): ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం పథకాలు అమలు చేస్తుందని గురువారం వర్ధన్నపేట కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ అధ్యక్షులు మల్లెపాక సమ్మయ్య అన్నారు. దరఖాస్తులు చేసుకున్న ప్రకారం సర్వే నిర్వహించి ప్రభుత్వం అర్హులైన వారిని గుర్తించడం జరుగుతుందన్నారు. దరఖాస్తులు చేసుకొని వారు గ్రామసభలలో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా వారు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే ప్రజా ప్రభుత్వం అన్నారు. ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు పంపిణీ ఎలాంటి అవకతవకలు లేకుండా నిర్వహణ కొనసాగుతుందని తెలిపారు. ఈ క్రమంలో లబ్ధిదారులెవరు అపోహాలు నమ్మి గాబరా పడవద్దు అన్నారు. ఏ పార్టీలో ఎవరికి న్యాయం జరిగినా.. జరగకపోయినా అర్హులైన వారిని గుర్తించి ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలందరికీ పంపిణీ చేసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపడుతుందని చెప్పారు. ప్రభుత్వ ఫలాలు ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా అందుతాయని వివరించారు.

## తెలంగాణలో రహదారుల అభివృద్ధిపై కేంద్రం ఫోకస్

### చేగుంట నుంచి దుబ్బాక మీదుగా రాజన్నసిరిసిల్లకు నేషనల్ హైవేకు ఎంపీ రఘురందన్‌రావు హామీ



హైదరాబాదజనవరి 23(జర్నలిస్ట్ వార్త): తెలంగాణలో రహదారుల అభివృద్ధిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫోకస్ పెట్టాయి. ఇప్పటికే అనేక మార్గాల్లో కొత్త రహదారులు మంజూరు చేశారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న పలు జాతీయ రహదారులను కూడా విస్తరిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల మధ్య అత్యతం రద్దీగా ఉండే హైదరాబాద్-విజయవాడ రహదారిని 4 నుంచి 6 వరుసలుగా విస్తరించేందుకు ప్లాన్ చేస్తున్నారు. త్వరలోనే అందుకు సంబంధించిన పనులు ప్రారంభం కానున్నాయి. మరికొన్ని ప్రాంతాల మధ్య కొత్తగా రహదారులు నిర్మించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం కొన్ని రహదారులు నిర్మిస్తుండగా.. మరికొన్ని రోడ్లను కేంద్రం నిర్మిస్తోంది. తాజాగా తెలంగాణలో మరో నేషనల్ హైవే నిర్మాణంపై కీలక హామీ వచ్చింది. చేగుంట నుంచి దుబ్బాక మీదుగా రాజన్నసిరిసిల్ల వరకు నేషనల్ హైవే నిర్మించాలని ఎప్పట్నుంచో డిమాండ్ ఉంది. ఈ విషయంపై స్థానికులు పలుమార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వినతులు కూడా సమర్పించారు. తాజాగా.. ఆ నేషనల్ హైవేపై మెదక్ ఎంపీ రఘునందన్ రావు కీలక హామీ ఇచ్చారు. జాతీయ రహదారి నిర్మాణం విషయాన్ని కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. స్థానిక ప్రజల ఆంకాంక్షల మేరకు రోడ్డు మంజూరయ్యేలా కృషి చేస్తానని అన్నారు. దుబ్బాక డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో పలువురు ఈ విషయంపై ఎంపీకి వినతిపత్రం అందించారు. చేగుంట -%సిరిసిల్ల మధ్య నేషనల్ హైవే చేపడితే రాష్ట్రంలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం అయిన వేములవాడకు ఈజీగా చేరుకోవచ్చునని అన్నారు. వేములవాడ- హైదరాబాద్ మధ్య కూడా దూరం తగ్గుతుందని చెప్పారు. వారి వినతిపై సానుకూలంగా స్పందించిన ఎంపీ రఘునందన్ రావు ఈ రహదారి అంశాన్ని తప్పకుండా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. నేషనల్ హైవే మంజూరుకు తాను శాయశక్తుల కృషి చేస్తానని చెప్పారు. త్వరలోనే కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసి రహదారి నిర్మాణంపై చర్చిస్తానని ఎంపీ రఘునందన్ రావు హామీ ఇచ్చారు. కాగా, ఎంపీ ప్రకటనతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చాలా ఏళ్లుగా ఈ రహదారి నిర్మాణం కోసం పోరాడుతున్నామని చెప్పారు. త్వరితగతిన రహదారి మంజూరైతే.. ఈ ప్రాంతం రూపురేఖలు మారిపోతాయని అంటున్నారు.


## ఇంటికలను దెబ్బతీస్తున్న ప్రభుత్వాలు

### జిఎస్టీ, రిజిస్ట్రేషన్ ఛార్జీల మోతతో కుదేలు - ధరల ప్రభావంతో అమాంతంగా పెరుగుదల

హైదరాబాద్,జనవరి 23(జర్నలిస్ట్ వార్త): ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఊరూవాడా ప్రచారం జోరుగా సాగుతోంది. ఏడాదైనా దీనికి సంబంధించి పక్కా కార్యాచరణ జరగేలదు. గ్రామాల్లోమాత్రం కాంగ్రెస్ నేతలు ఊదరగొడుతున్నారు. పేదలు ఇల్లు కట్టుకునే పరిస్థితి లేకుండా పోయింది. ఇలా ఎంతమందికి ఇందరమ్మ ఇళ్లు కట్టిస్తారు. మిగతా పేదవారి పరిస్తితి ఏంటన్నది పాలకులు ఆలోచించడం లేదు. ప్రజలపై రకరకాల పన్నులతో పీల్చి పిప్పి చేస్తున్నారు. ఒకప్పుడు మధ్యతరగతి వారు సునాయాసంగా ఓ ఫ్లాట్ కొనుక్కోగలిగేవారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. హైదరాబాద్ లాంటి నగరంలో కోటిన్నర లేనిదే ఓ అపార్ట్‌మెంట్ రావడం లేదంటే ఇది అభివృద్ధి అవుతుందా.. లేక సామాన్యులకు ఇల్లు అందుబాటులో లేకపోవడమా అన్నది ఆలోచన చేయాలి. ఇందులో జిఎస్టీ పదినుంచి 12 లక్షలు, రిజస్ట్రేషన్‌కు ఓ పది నుంచి 12 లక్షలు కట్టాలంటే ఎంత భారం పడుతుందో ప్రభుత్వాలు ఆలోచించడం లేదు. తెలంగాణలో రుణం తీసుకుంటే..అదనంగా ప్రభుత్వానికి మరో 50వేలు



అప్పనంగా చెల్లించాల్సి వస్తోంది. గత కెసిఆర్ ప్రభుత్వం పెట్టిన భిక్ష ఇది. ఇలాంటి అడ్డగోలు విధానాలను ప్రభుత్వాలు సమీక్షించాలి. సామాజిక రుగ్మతగా మారిన వ్యవస్థీకృత అసమానతలను రూపుమాపుతున్నాం అన్న పదాలు వినడానికి బాగానే ఉంటాయి. గత పదేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థలో అనేక గుణాత్మక మార్పులు వచ్చాయని చంకలు గుద్దుకోవడంతో సరిపుచ్చితే మార్పు రాదు. పన్ను వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణల వల్ల ట్యాక్స్ చెల్లింపుదారుల సంఖ్య పెరిగింది. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం వల్ల పొదుపులు, పెట్టుబడులకు భద్రత ఏర్పడిందని అంటున్నారు. నిజానికి ఇదొక్కటే దేశాన్ని, ప్రజలను అగాధంలోకి నెట్టుతోందని ఎంత త్వరగా గుర్తిస్తే అంతమంచిది. ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చిందన్న మాటలు శుద్ధ అబద్ధం. ఆర్థిక వ్యవస్థ బలోపేతమై ప్రజలకు ఉపాధి లభించేలా ప్రజా ప్రయోజనాల కోసం అనేక కార్యక్రమాలు, పథకాలు రూపొందించాల్సి ఉంది. బ్యాంకులను సంస్కరించాల్సిన అవసరం ఉంది. రుణాలు పొందేవారిపై వడ్డీల భారం పెరుగుతోంది. జిఎస్టీ వల్ల మరింత భారం పడుతోంది. దీనికితోడు ఇల్లు కొనాలనుకుంటున్న వారిపై రాష్ట్రంలో కూడా పన్నులు, రిజిస్ట్రేషన్ ఛార్జీలు పడుతున్నాయి. వీటికి తోడు స్టీలు, సిమెంట్, లేబర్ ఛార్జీలు, ఇతరత్రా మెటీరియల్ ఛార్జీలు విపరీతంగా పెరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఇవన్నీ సమీక్షించాలి. అప్పుడే మధ్యతరగతి వారు సొంతంగా ఇల్లు కొనుక్కోగలరు.



# మరో వెబ్‌సిరీస్‌లో సమంత

తెలుగు, తమిళం, హిందీ భాషల్లో సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న భామల్లో ఒకరు సమంత. సిటాడెల్ వెబ్ ప్రాజెక్ట్‌తో బిజీగా మారిన ఈ బ్యూటీ.. విడుదల తర్వాత రిలాక్సేషన్ మూడ్‌లోకి వెళ్లిపోయింది. సమంత క్రిస్మస్, న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ కోసం యూఎస్ టూర్‌లో ఉన్న విషయం తెలిసిందే. యూఎస్‌లో తన వర్కవుట్ సెషన్‌తోపాటు ఇతర కార్యకలాపాల గురించి అప్‌డేట్స్‌ను నెట్టింట షేర్ చేసుకుంది. అయితే సామ్ తన లాంగ్ ట్రిప్ వెకేషన్ ముగించుకొని ఇండియాకు తిరిగొచ్చేసింది. బుధవారం చెన్నై, ముంబైలో జరిగిన ఈవెంట్స్‌లో పాల్గొన్నది. చెన్నైలోని సత్యభామ యూనివర్సిటీలో వరల్డ్ పికిల్‌బాల్ లీగ్ కోసం చెన్నై సూపర్ చాంప్స్ జెర్సీని లాంచ్ చేసింది. ఈవెంట్ ముగిసిన తర్వాత ముంబైకి పయనమైంది. మళ్లీ చాలా కాలం తర్వాత తన కొత్త వెబ్ సిరీస్ వెబ్ సిరీస్ షూట్‌లో జాయిన్ అయింది. ఇప్పుడీ అప్‌డేట్‌తో ఫుల్ ఖుషీ అవుతున్నారు సామ్ అభిమానులు. విజయ్ దేవరకొండతో చివరగా ఖుషి సినిమాలో నటించింది సమంత. ఈ సినిమా తర్వాత తెలుగులో మళ్లీ కొత్త ప్రాజెక్టు ప్రకటించలేదు.

# వర్మకు అంధేరీ కోర్టు షాక్

## మూడు నెలల జైలుశిక్షతోపాటు రూ.3.72 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు



సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మకు అంధేరీ కోర్టు షాక్ ఇచ్చింది. చెక్ బౌన్స్ కేసులో ఆర్జీవీ మూడు నెలల జైలు శిక్షను విధించింది. అంతే కాకుండా 3.72 లక్షలు నష్టపరిహారం చెల్లించాల్సిందేనని కోర్టు స్పష్టం చేసినట్టుగా తెలుస్తోంది. 2018లో మహేష్ చంద్ర మిశ్రా వేసిన ఈ కేసులో భాగంగా కోర్టు నేడు ఈ విధంగా తీర్పునిచ్చింది. మరి వర్మ దీనిపై ఎలా రియాక్ట్ అవుతాడో చూడాలి. గత ఏడేళ్లు కోర్టులో వాదనలు జరుగతూనే ఉన్నాయట. కానీ వర్మ మాత్రం ఏనాడూ కోర్టులో హాజరు కాలేదని సమాచారం. దీంతో ఆగ్రహించిన కోర్టు వర్మకు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసి ఇలా తీర్పుని ఇచ్చింది. వర్మ ప్రస్తుతం కమ్ బ్యాక్ ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే. రీసెంట్‌గానే సత్య రీ రిలీజ్ సందర్భంగా వర్మ రియలైజ్ అయ్యాడు. తాను ఇంత గొప్ప సినిమాల్ని తీశానంటే నమ్మబుద్ధి కావడం లేదని, తనకు పరిశ్రమ ఇచ్చిన అవకాశాల్ని ఉపయోగించుకోలేదని, మధ్యలో పిచ్చి పిచ్చి చిత్రాలన్నీ చేశానని వర్మ పశ్చాతాప్పడ్డాడు. ఇక తాను మంచి చిత్రాలే తీస్తానని చెప్పుకొచ్చాడు. ఈ క్రమంలోనే సిండికేట్ అనే ఓ కొత్త మూవీ గురించి ప్రకటించాడు. టైటిల్‌తో పాటుగా సినిమా కాన్సెప్ట్‌ను కూడా పంచుకున్నాడు. క్రైమ్ ఎప్పుడూ అంత కాదని, రూపం మార్చుకుంటుందని, మనుషులే జంతువుల కంటే క్రూరమైన వాళ్లు అనే కాన్సెప్టులతో సిండికేట్ సినిమా ఉంటుందని వర్మ చెప్పుకొచ్చాడు. చూస్తుంటే మళ్లీ సర్కార్, సత్య రేంజ్‌లో మూవీని వర్మ ప్లాన్ చేసినట్టుగా కనిపిస్తోంది. త్వరలోనే సిండికేట్ కాస్ట్ అండ్ క్రూ గురించి ప్రకటిస్తానని వర్మ తెలిపాడు. మరి వర్మ మాటలు ఇప్పుడు నిర్మాతలు నమ్మే స్థితిలో ఉన్నారా? అసలు వర్మ చిత్రాలు అంటే ఆడియెన్స్ చూస్తారా? అన్నది అనుమానమే. గత కొన్నేళ్లుగా పిచ్చి, అడల్ట్, పనికి రాని చిత్రాలు తీస్తూ వర్మ తన ఇమేజ్‌ను తానే సర్వ నాశనం చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే ఈ కేసుకు సంబంధించి ట్విట్టర్ వేదికగా స్పందించారు వర్మ. నా మీద అంధేరి కోర్టు విధించిన శిక్షకు సంబంధించి నేను క్లారిటీ ఇవ్వాలి అనుకుంటున్నాను.. ఇది 7 ఏండ్ల క్రితం నాటి విషయం. నా మాజీ ఉద్యోగితో ? 2.38 లక్షల వివాదానికి సంబంధించినది. నా న్యాయవాదులు ఈ ఫిర్యాదుపై విచారణ జరుపుతున్నారు. కేసు ప్రస్తుతం కోర్టులో ఉన్నందున దీని గురించి ఇంతకంటే ఏం చెప్పలేను అంటూ ఆర్జీవీ రాసుకోచ్చాడు.

# ఇప్పటికీ టాప్ ట్రెండింగ్ లో పవర్ స్టార్ సాంగ్!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నిధి అగర్వాల్ హీరోయిన్ గా దర్శకుడు జ్యోతి కృష్ణ తెరకెక్కిస్తున్న భారీ చిత్రం హరిహర వీరమల్లు కోసం అందరికీ తెలిసిందే. పాన్ ఇండియా సినిమాగా అనౌన్స్ చేయగా ఇపుడు సినిమా ముగింపు దశల్లో ఉంది. అయితే ఈ సినిమా నుంచి రీసెంట్ గానే పవన్ పాడిన మాట వినాలి సాంగ్ రిలీజ్ కి రాగా దీనికి భారీ రెస్పాన్స్ వచ్చింది.మొన్న 17న రిలీజ్ కి వచ్చిన ఈ సాంగ్ ఇప్పటికీ యూట్యూబ్ లో తెలుగు వెర్షన్ టాప్ లో ట్రెండ్ అవుతుంది. ఇలా ఏకంగా 130 గంటలకి పైగా ఈ సాంగ్ ట్రెండ్ అవుతూ ఉండడం విశేషం. మొత్తానికి అయితే పవన్, కీరవాణిల మొదటి సాంగ్ చార్ట్ బస్టర్ అయ్యిందని చెప్పవచ్చు. ఇక ఈ చిత్రానికి ఏ ఎం రత్నం నిర్మాణం వహిస్తుండగా ఈ మార్చ్ 28న గ్రాండ్ గా రిలీజ్ కి తీసుకురాబోతున్నారు.

# రానా గేమ్ ఆన్.. పర్ఫెక్ట్ టైమింగ్..!



దగ్గుబాటి వారసుడు రానా సినిమాల విషయంలో కాస్త స్పీడ్ తగ్గించాడు. 2022 లో విరాట పర్వం సినిమా తర్వాత ఏవో ఒకటి రెండు సినిమాలు అది కూడా గెస్ట్ రోల్ లాగా చేశాడు తప్ప లీడ్ రోల్ చేసింది లేదు. లాస్ట్ ఇయర్ కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీకాంత్ వేటయ్యన్ సినిమాలో నటించాడు రానా. ఐతే ఆ సినిమా వల్ల పెద్దగా వచ్చింది ఏమి లేదు. రానా సినిమాల విషయంలో చేస్తున్న ఈ లేట్ వల్ల దగ్గుబాటి ఫ్యాన్స్ ఆందోళనలో ఉన్నారు.రానా లీడ్ రోల్ లో తేజ డైరెక్షన్ లో రాక్షస రాజా సినిమా చేయాల్సి ఉంది. కానీ ఆ ప్రాజెక్ట్ ఎందుకో ఆగిపోయింది. మరోపక్క గుణశేఖర్ తో చేయాల్సిన హిరణ్యకశ్యప సినిమా కూడా హోల్డ్ లో ఉంది. ఆ సినిమా త్రివిక్రం ఆధ్వర్యంలో చేసేలా ప్లాన్ చేస్తున్నాడు రానా. ఐతే లేటెస్ట్ గా ప్రశాంత్ వర్మ డైరెక్షన్ లో రానా లీడ్ రోల్ లో ఒక సినిమా రాబోతుందని చర్చ మొదలైంది. హనుమాన్ సినిమాతో పాన్ ఇండియా హిట్ అందుకున్న డైరెక్టర్ ప్రశాంత్ వర్మ బాలీవుడ్ స్టార్ రన్ వీర్ సింగ్ తో బ్రహ్మ రాక్షస సినిమా ప్లాన్ చేశాడు. ప్రశాంత్ వర్మ, రన్ వీర్ సింగ్ ఇద్దరు కలిసి కొద్దిరోజులు వర్క్ షాప్ కూడా నిర్వహించారు. ఐతే ఏమైందో ఏమో కానీ సడెన్ గా ఆ ప్రాజెక్ట్ నుంచి రణ్ వీర్ సింగ్ బయటకు వచ్చేశాడు. క్రియేటివ్ డిఫరెన్సెస్ వల్ల హీరో వెనక్కి తగ్గినట్టు చెప్పుకున్నారు. ఐతే ఇప్పుడు ఆ బ్రహ్మ రాక్షస ప్రాజెక్ట్ రానా దగ్గరకు వచ్చినట్టు తెలుస్తుంది. రానా ప్రశాంత్ వర్మ మధ్య స్టోరీ డిస్కషన్స్ జరిగాయట. దాదాపు సినిమా ఓకే అయినట్టే అని టాక్. ప్రశాంత్ వర్మతో రానా సినిమా చేస్తే మాత్రం ఆ సినిమా నెక్స్ట్ లెవెల్ లో ఉంటుందని చెప్పొచ్చు. ప్రశాంత్ వర్మ ప్రస్తుతం ఖాళీతో పాటు నందమూరి మోక్షజ్ఞ సినిమా చేస్తున్నాడు. ఈ ప్రాజెక్ట్ లు పూర్తి చేశాకే రానా బ్రహ్మ రాక్షస సెట్స్ మీదకు వెళ్తుందని చెప్పొచ్చు. పాన్ ఇండియా లెవెల్ లో స్పెషల్ రోల్స్ తో సూపర్ క్రేజ్ తెచ్చుకున్న రానాకి ఒక సాలిడ్ సినిమా పడితే మాత్రం ఒక రేంజ్ కి వెళ్లే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు.



# ఇంకా హార్డ్‌వర్క్ చేయి

## డైరెక్టర్ అనిల్ రావిపూడికి చిరంజీవి సలహా

సినిమాకు బ్లాక్ బస్టర్ సక్సెస్ దక్కడంతో దర్శకుడు అనిల్ రావిపూడి పోస్ట్ రిలీజ్ ప్రమోషన్స్‌తోనూ దూసుకు పోతున్నారు. సినిమా విడుదల తర్వాత వరుస ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో అనిల్ రావిపూడి మాట్లాడుతూ సినిమా కోసం తాను అనుకున్న నటీనటులను, సాంకేతిక నిపుణులను తీసుకున్నాను. ఎక్కడా రాజీ పడాల్సిన అవసరం రాలేదని అన్నారు. నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ గారు తనకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చారని, బడ్జెట్ విషయంలో తాను అనుకున్న దానికి వారు ఓకే చెప్పారని అన్నారు. నిర్మాతలు తనపై చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ వారు ఎన్నో గొప్ప విజయాలను అందుకున్నారు, నాపై వారు చూపించే అభిమానంతో అలా మాట్లాడారని చెప్పుకొచ్చారు. అనిల్ రావిపూడి తదుపరి సినిమాను మెగాస్టార్ చిరంజీవితో చేయబోతున్న విషయం తెల్సిందే. కనుక సంక్రాంతికి వస్తున్నాం సినిమాపై మెగాస్టార్ రియాక్షన్ ఏమై ఉంటుంది అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. తాజాగా దర్శకుడు అనిల్ రావిపూడి ఆ విషయమై స్పందిస్తూ... చిరంజీవి గారు ఊర్లో లేరు. ఆయన సినిమా రిజల్ట్ గురించి తెలిసి నాకు మెసేజ్ చేశారు. చాలా సంతోషంగా ఉంది, మన సినిమాకు ఇంకా ఎక్కువ హార్డ్ వర్క్ చేయి అని చెప్పారు. సినిమా చూసి ఉంటే తప్పకుండా ఫోన్ చేసి మరిన్ని విషయాలను ఆయన చెప్పేవారు. ఈ సినిమా ఫలితంతో ఆయన చాలా సంతోషంగా ఉన్నారని అనిల్ రావిపూడి పేర్కొన్నారు.

# పెళ్లి, తిరుపతి, ముగ్గురు పిల్లలు... జాన్వీ ఫ్యూచర్ ప్లాన్



అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలు జాన్వీ కపూర్ బాలీవుడ్‌లో అడుగు పెట్టి చాలా కాలం అవుతోంది. టాలీవుడ్ ప్రేక్షకుల ఎదురు చూపులకు తెర దించుతూ 'దేవర' సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. బాలీవుడ్‌లో దక్కని హిట్ టాలీవుడ్‌లో జాన్వీ కపూర్‌కి దక్కింది. జాన్వీ కపూర్ ప్రస్తుతం రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాలో నటిస్తున్న విషయం తెల్సిందే. ఇంకా పలు తెలుగు సినిమాల నుంచి ఆఫర్‌లు వస్తున్నా ఈ అమ్మడు మాత్రం హిందీ సినిమాలపై ఎక్కువ దృష్టి పెట్టింది. ఇప్పటికే పలు సార్లు జాన్వీ కపూర్ తన పెళ్లి గురించి మాట్లాడింది. తాను తిరుపతిలో పెళ్లి చేసుకుంటాను అంటూ గతంలోనే జాన్వీ కపూర్ చెప్పుకొచ్చింది.తాజాగా కరణ్ జోహార్ టాక్ షోలో జాన్వీ కపూర్ మరోసారి పాల్గొంది. ఆ సమయంలో జాన్వీ కపూర్ మాట్లాడుతూ తాను పెళ్లి చేసుకోవాలని ఇప్పుడు అనుకోవడం లేదు. కానీ కచ్చితంగా తాను తిరుమలలో పెళ్లి చేసుకుని ముగ్గురు పిల్లలతో కలిసి తిరుమలలోనే సెటిల్ అవ్వాలి అన్నది కోరిక. పెళ్లి తర్వాత సినిమాలకు గుడ్ బై చెప్పి భర్త, పిల్లలతో తిరుమలలో ఉంటూ, ప్రతి రోజూ అరటి ఆకులో అన్నం తింటూ, గోవిందా గోవిందా అని స్మరించుకుంటూ జీవితాన్ని సంతోషంగా గడపాలని కోరుకుంటున్నాను. ఆ సమయంలో మణిరత్నం సినిమాల్లోని సాంగ్స్ ఉండాలని ఆశ పడుతున్నాను అంది.జాన్వీ కపూర్ కి ముగ్గురు పిల్లల కోరిక విచిత్రంగా ఉందంటూ సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తున్నారు. ఈమధ్య కాలంలో ఎక్కువ శాతం మంది స్టార్స్, సెలబ్రిటీలు, సాదారణ జనాలు అంతా ఇద్దరు పిల్లలను కోరుకుంటున్నారు. కానీ జాన్వీ కపూర్ మాత్రం ముగ్గురు పిల్లలను కోరుకోవడం ఒకింత ఆశ్చర్యంగా ఉందని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో జాన్వీ కపూర్ కోరికల గురించి ప్రముఖంగా చర్చ జరుగుతోంది. హీరోయిన్‌గా మంచి జోరు మీదున్న జాన్వీ కపూర్ ఒక వయసు వచ్చి, ఆఫర్లు తగ్గిన తర్వాత సినిమా ఇండస్ట్రీకి దూరం అయ్యి పెళ్లి చేసుకుని తిరుమలలో జీవితాన్ని గడపడం పెద్ద కష్టం కాకపోవచ్చు. అయితే ఫ్యామిలీతో ఆమె నిజంగానే తిరుమలలో ఉంటుందా అనేది అనుమానమే.